క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

గంగవరం: పాతగంగవరం గ్రామంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్(బాబు), పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. .ఈ సమావేశంలో ఎన్నికల తర్వాత పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఎదుర్కొంటున ఇబ్బందులు, సమస్యలు గురించి చర్చిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పనిసరిగా హాజరు కావాలని వారు కోరారు. మండల కేంద్రమైన గంగవరంలో నిర్వహించనున్న పార్టీ సమావేశానికి భారీగా పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ నాయకుడు తోట రాజేశ్వర రావు పిలుపు నిచ్చారు.

17న రంపచోడవరంలో...

రంపచోడవరం: రంపచోడవరం మండల వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం ఈనెల 17 నిర్వహించనున్నట్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. గురువారం భీరంపల్లి పామ్ ఆయిల్ తోటలో నిర్వహించే ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. ఎన్నికల తరువాత పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పడుతున్న ఇబ్బందులు, ఇతర ప్రజా సమస్యలు గురించి చర్చించనున్నట్టు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(అనంతబాబు) పాల్గొంటారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ మాలధారణ



మాలధారులతో సాయిరాం స్వామిజీ

జి.మాడుగుల: మండలంలో గాంధీనగరం గ్రామంలని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశాఖపట్నం భీమిలి సద్గురు సేవాశ్రమం, హనుమ సేవా ఆశ్రమం ప్రతినిధి సాయిరాం స్వామిజీ హనుమాన్ దీక్షలో భాగంగా మాలధారణ కార్యక్రమం నిర్వహించారు. మాలధారులు 41రోజులు దీక్ష పూర్తయిన వెంటనే ఇదే దేవాలయంలో దీక్ష విరమణ కార్యక్రమం చేయాల్సిందని ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో గల పలు గ్రామాలకు చెందిన భక్తులకు దీక్ష మాలధారణ చేశామన్నారు. మే నెల 22న దీక్ష విరమణ కార్యక్రమం ఉంటుందన్నారు. హనుమ మాలలు ఉచితంగా అందజేసినట్టు సాయిరాం స్వామిజీ అన్నారు.

నేడు సదరం క్యాంపు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో బుధవారం సదరం క్యాంపు ఏర్పాటుచేసినట్టు ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, రేషన్ కార్డులతో క్యాంపునకు హాజరు కావాలని, దివ్యాంగుల అవసరం పట్టి ఉచితంగా పరికరములు అందజేస్తామన్నారు. మండల పరిషత్ కార్య లయ ఆవరణలో సదరం క్యాంపు జరుగుతుందని, హైదరాబాద్, విజయవాడ నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు హాజరవుతారని పేర్కొన్నారు. శిబిరానికి హాజరైన దివ్యాంగులు, వారి సంరక్షకులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ముంచంగి పుట్టు, పెదబయలు మండలాల దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన యువకుడు

రాజవొమ్మంగి: మండలంలోని మిరియాలవారి వీధి గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరికి కాలు విరిగింది. స్థానికులు వీరిని అడ్డతీగల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్నారు. కొయ్యూరు మండలం కాకరపాడు గ్రామంలో జరుగుతున్న తిరునాళ్లకు బైక్‌పై వెళ్లి తిరిగి స్వగ్రామం వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు.

17న కుస్తీ పోటీలు

పాడేరు : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 17న రంపచోడవరం మండలం ఇర్రపల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో అండర్-14, 17 బాలికలకు కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్టు సంస్థ అధికారి ఎ.జగన్‌మోహన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆసక్తి గల క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రాలతో గురువారం ఉదయం 7.30 గంటలకు పోటీలు నిర్వహించే ప్రదేశం వద్ద హాజరు కావాలన్నారు. జిల్లాలో కుస్తీ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9000904610, 9000274225 నంబర్లకు సంప్రదించాలన్నారు.



దేముడువలసలో ఆకుకూరల పంట



సాగర గ్రామంలో మొక్కజొన్న పంట


ఆశాజనకంగా సాగు

వేసవిలోను కూరగాయల పంటలు

అరకొర నీటి సదుపాయం



సావ్వాలో కూరగాయల పంటలు



కండ్రుమ్‌లో సాగులో ఉన్న టమాటా పంట



కురిడిలో క్యాబేజీ పంట

డుంబ్రిగుడ: గిరిజన రైతులు వ్యవసాయం పంటలతో పాటు కూరగాయల సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. మండలంలోని సొవ్వా, గసభ, అరమ, పోతంగి, కండ్రుమ్, కొల్లాపుట్టు, తదితర పంచాయతీల్లో వేసవిలోను అధిక సంఖ్యలో పండించి లాభాలు ఆర్జిస్తున్నారు. క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బ్రకోలీ, మిరప, వంగ, టమాటా, కొత్తిమీర వంటి పంటలతో పాటు మొక్కజొన్న వంటి వాణిజ్య పంటలు సాగు చేస్తున్నారు. సమీప వారపు సంతల్లో విక్రయించి లాభాలు పొందుతున్నారు. ప్రతి మూడు మాసాలకు వచ్చే టమాటాతో పాటు మిరప, వంకాయ, క్యాబేజి, ముల్లంగి పంటలు పండిస్తున్నారు. ఆయా పంటల సాగుపై గిరిజనులు మెలకువలు నేర్చుకుని వాటికి వర్షాభావ పరిస్థితుల్లో సమీప గెడ్డల నుంచి, కొండ వాగుల నుంచి వచ్చే నీటిని గ్రావిటీ పథకంలో ఒడిసి పట్టుకొని వాటిని పొలాలకు మళ్లించి కూరగాయల పంటలను పండిస్తున్నారు. ఈ ఏడాది వేసవిలో ఎండలు ఎక్కువగా ఉన్నా అనేక మంది గిరిజన రైతులు కూరగాయల పంటపై మక్కువ చూపుతున్నారు. గత ఏడాది వర్షాల తక్కువ కావడంతో మండలంలోని అంతంత కూరగాయాలు పంటలు చేస్తున్న రైతులు ఈ ఏడాది వర్షాకాలంతో పాటు ఈ వేసవిలోను ముమ్మరంగా వ్యవసాయ పంటలతో పాటు కూరగాయలు పండిస్తున్నారు. ఆయా పంట లు ఆశాజనకంగా కాపు వస్తుండడంతో పురుగు ఆశించకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే మన్యంలో రెండు వారాలుగా వేసవి వర్షాలు కురుస్తుండడంతో మంచుతో పండే టమాటాలు కుళ్లిపోతున్నాయంటున్నారు. కావిడి టమాటా కేవలం రూ.250 నుంచి రూ.300లకు అతితక్కువ ధరలకు విక్రయిస్తున్నట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వేసవిలోను ఉద్యానవన శాఖ అధికారి రైతులకు కూరగాయలు సాగుపై పలు సూచనలు చేస్తున్నారని గిరిజన రైతులు చెబుతున్నారు.

సాగుతోనే జీవనోపాధి



కూరగాయల పంటలపై దృష్టి సారిస్తున్నాం. మా ప్రాంతంలో వర్షాలు తక్కువ కాబట్టి కొండ నుంచి వచ్చే నీరు ఆధారంగా చేసుకొని సంవత్సరం పాటు కూరగాయల సాగు చేస్తుంటాం. సొవ్వా పంచాయతీలో సుమారు 22 గ్రామాల్లో గిరిజనులు అధిక సంఖ్యలో కూరగాయల పంటతోనే జీవనోపాధి పొందుతున్నాం.

–వంతాల చంద్రమ్మ, సొవ్వా పంచాయతీ, డుంబ్రిగుడ మండలం

జాతరను విజయవంతం చేయండి



జాతర ఏర్పాట్లపై పోలీసు అధికారులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి బాలరాజు



పనులను పరిశీలిస్తున్న సీఐ వినోద్‌బాబు, ఎస్‌ఐ వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు

చింతపల్లి: ఈ నెల 24 నుంచి 27 చింతపల్లిలో నిర్వహించే ముత్యాలమ్మ తల్లి జాతరను అందరి సహకారంతో విజయవంతం చేయాలని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు అన్నారు. మంగళవారం చింతపల్లి వచ్చిన ఆయన ఉత్సవ కమిటీ నిర్వాహకులు, పోలీసు అధికారులతో ఉత్సవ ఏర్పాట్లపై చర్చించి పలు సూచనలు ఇచ్చారు. జాతరకు అధిక సంఖ్యలో వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఉత్సవంలో భాగంగా వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేసే వేదికలను, ఆలయ పరిసరాలను సీఐ వినోద్‌బాబు, ఎస్‌ఐలు రమణ, వెంకటేశ్వరరావులు పరిశీలించారు. భద్రతపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బారికేడ్ల ఏర్పాట్లు వంటివాటిపై నిర్వాహకులతో చర్చించారు. ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు హేమంత్‌కుమార్, వినాయక రావులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



కొత్తవీధి వద్ద కోతకు గురైన రహదారి

గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధి మండల కేంద్రానికి సమీపంలో కొత్తవీధి వద్ద సీలేరు వెళ్లే ప్రధాన రహదారి కోతకు గురైంది. వర్షాలకు ఈ రహదారి ఛిద్రంగా మారింది. దీంతో తరచూ ఈ మార్గంలో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. రహదారి అంచులో పెద్ద గొయ్యి ఏర్పడింది. ఇది దగ్గరకు వచ్చే వరకూ వాహనచోదకులకు కనిపించడం లేదు. దీంతో వారు ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానికులు ప్రమాదాన్ని గుర్తించి అప్రమత్తం చేసేందుకు ఒక కర్రకు ఎర్రని వస్త్రాన్ని చుట్టి ఈ గోతిలో జెండాలా పాతారు. దీంతో అదే హెచ్చరిక సూచీగా భావించి అప్రమత్తంగా వాహనాలు నడుపుతున్నారు. కనీసం ఇటువంటి ప్రాంతాల వద్ద అయినా ఆర్‌అండ్‌బీ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోగా కనీసం హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేయకపోవడంపై ఈమార్గంలో తిరిగే ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాంతంలో ఉన్న గొయ్యిని పూడ్చే పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అమ్మవారి జాతరకు పూజాసామగ్రి వితరణ



పూజా సామగ్రిని అందుకుంటున్న భక్తులు

అడ్డతీగల: మండలంలోని గ్రామాల్లో గంగాలమ్మ తల్లి జాతర నిర్వహణ కోసం పవనగిరి క్షేత్రం తరపున చీర, సారె, అమ్మవారి ఘటం, పూజా సామగ్రిని పవనగిరి వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య, విజయలక్ష్మి దంపతులు మంగళవారం అందజేశారు. ఇందులో భాగంగా మండలంలోని ఎర్ర గొండపాలెం, చెందుర్తి, కె.ఎర్రగొండ, ఎర్రంరెడ్డిపాలెం, తేనెలమామిడి, చావడికోట, నిమ్మచెట్ల, బంద, చింతూరు, పెరికివలస, ఉప్పరిగోతుల, మడిశాల, గుట్టేడు తదితర గ్రామాలకు చెందిన పూజార్లు వచ్చారు. గంగాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి అనంతరం చీర, సారె, పూజాసామగ్రి పంపిణీ చేశారు. బుధవారంతో సామగ్రి అందజేత కార్యక్రమం పూర్తవుతుందని తణుకు వెంకటరామయ్య చెప్పారు.

గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి



తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న పీసా కమిటీ నేతలు

జి.మాడుగుల: గిరిజన ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, గిరిజనేతరుల అక్రమ కట్టడాలని నిలుపుదల చేయాలని పీసా కమిటీ మండల అధ్యక్షుడు లకే రామకృష్ణ, కార్యదర్శి బాలకృష్ణ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం మండలంలో గల పీసా కమిటీల ఉపాధ్యక్షు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఉపాధ్యక్షులు శ్రీను, చంద్రమోహన్, సుధాకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.బినామీ నిరోధక చట్టాన్ని అమలు చేయాలని, ఆదివాసీల స్వాధీనంలో ఉన్న పోడు భూములకు పట్టాలను మంజూరు చేయాలని, గిరిజనేతర వలస నిషేద చట్టాన్ని అమలు చేయాలని వారు కోరారు.

క్లస్టర్ మ్యాపింగ్ సమస్యలపై వినతి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు అర్జున్, సురేష్‌లు

ముంచంగిపుట్టు: సచివాలయాలకు క్లస్టర్ మ్యాపింగ్ చేస్తే సమస్యలు తప్పవని మండల వైఎస్సార్‌సీపీ నేతలు జి.అర్జున్, ఎస్.సురేష్‌లు అన్నారు. స్థానిక ఎంపీడీవో సూర్యనారాయణమూర్తిను మంగళవారం వారు కలిసి, క్లస్టర్ మ్యాపింగ్ వల్ల జర్రెల, కర్రిముఖిపుట్టు పంచాయతీల ప్రజలు ఇబ్బందులు పడతారని, ప్రభుత్వం ఈ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్రెల, కర్రిముఖిపుట్టు పంచాయతీల్లో 34 గ్రామాలకు చెందిన 6,135 జనాభా ఉన్నారని, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రెండు పంచాయతీలకు కలిపి కర్రిముఖిపుట్టులో సచివాలయం ఏర్పాటు చేశారని, ప్రజలకు సజావుగా ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండేవని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం క్లస్టర్ మ్యాపింగ్ విధానం తీసుకురావడంతో సంక్షేమ పథకాలు, పాలనకు ప్రజలు దూరమవుతారన్నారు. మూడు, నాలుగు పంచాయతీలకు ఒక్క సచివాలయం ఏర్పాటుతో సరైన పద్ధతి కాదని, తక్షణమే ప్రజల అవస్థలు అర్థం చేసుకొని, పాత పద్ధతిలోనే సచివాలయ వ్యవస్థను కొనసాగించాలని వారు కోరారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు టీషర్ట్‌లు



పంపిణీ చేసిన టీషర్ట్‌లతో విద్యార్థులు

రంపచోడవరం: రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు ఎన్‌ఎస్‌ఎస్ లోగో, కళాశాల పేరుతో తయారుచేసిన టీషర్ట్‌లను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ మంగళవారం అందజేశారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, సర్టిఫికెట్‌లను అందజేశారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరం బాధితులకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సున్నం రాజులు

వి.ఆర్.పురం: మండలంలోని పెద్దమట్టపల్లిలో సీపీఎం నాయకుల సమావేశం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు కారం సుందరయ్య మాట్లాడుతూ పోలవరం ఫేస్ వన్ ముంపు గ్రామాలుగా సర్వే చేసిన వి.ఆర్.పురం, వడ్డుగూడెం, రాజుపేట, తోటపల్లి, చింతరేగుపల్లి, కన్నాయిగూడెం, వెంకన్నగూడెం, రామవరం, సోములగూడెం, లక్ష్మీనగరం, చోప్పలి గ్రామలను 41.15 కాంటూరు గ్రామలుగా గుర్తించి తక్షణమే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కల్పించాలన్నారు. పార్టీ సున్నం రాజులు మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఎటువంటి ప్రభుత్వ జీవో లేకుండా సర్వేల పేరుతో నిర్వాసితులను మోసం చేయడం సరికాదన్నారు. తక్షణమే జీవో ప్రకటించాలన్నారు. ముంపు ప్రాంతాల్లో యువతకు ప్రభుత్వం ఏ విధమైన ఉపాధి కల్పన, ఇతరత్రా సాయం అందించడం లేదన్నారు. వి.ఆర్.పురం మండలం 2022 వరదల్లో పూర్తిగా ముంపునకు గురైందని, మండలం మొత్తన్ని యూనిట్‌గా తీసుకొని పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచ్‌లు వి.లక్ష్మి, ఎస్.మారయ్య, పి.సరోజిని, కె.బుచ్చమ్మ, ఎంపీటీసీ సభ్యుడు ప్రదీప్‌కుమార్, నాయకులు చినబాబు, సత్తిబాబు, శ్రీరామ్మూర్తి, లక్ష్మణరావు, తాతబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో దోమల మందు పిచికారీ



యార్లగడ్డలో దోమలమందు పిచికారీ



దొరగుడ గ్రామంలో దోమల మందు పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది



జిఎం కొత్తూరులో పనులను పరిశీలిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ డానిస్, ఎంపీహెచ్ఈవో ప్రకాష్

డుంబ్రిగుడ: కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.రాంబాబు ఆధ్వర్యంలో గుంటసీమ సబ్‌సెంటర్ దొరగుడ గ్రామంలో దోమల మందు పిచికారీ పనులు జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ పి.రాంబాబు మాట్లాడుతూ మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని దోమల వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ఈ పిచికారీ చేస్తామన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ రామారావు, హెల్త్ అసిస్టెంట్ కె.రవీంద్ర, ఏఎన్‌ఎమ్‌లు గీత, సుబ్బలక్ష్మి, ఆశా వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: దోమల నివారణకు నివాసాల్లో మలేరియా స్ప్రేయింగ్ చేయించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ డానిస్, ఆరోగ్య విస్తరణ అధికారి నడిగట్ల ప్రకాష్ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో మలేరియా స్ప్రేయింగ్ పనులను వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల వల్ల ఎపిడమిక్ సీజన్ కావడంతో మలేరియా జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున్న ప్రజలు తగిన ఆరోగ్యపరమైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గ్రామాల్లో ముందస్తుగా ఏసీఎం స్ప్రేయింగ్ పనులు నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. సబ్ యూనిట్ అధికారి నూకరాజు, హెల్త్ విజిటర్ మేనక, ఏఎన్ఎం చిన్నతల్లి, హెల్త్ అసిస్టెంట్ కొత్తం దొర తదితరలు పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఏసీఎమ్ 5 శాతం మొదటి విడత దోమల మందు పిచికారీను ప్రారంభించారు. మండలంలో మొదటవిడతగా యార్లగడ్డ గ్రామంలో దోమలమందు పిచికారీ పనులను ప్రారంభించారు. పిచికారీకు 43 సమస్యా త్మక గ్రామాలను గుర్తించినట్టు చవిటిదిబ్బలు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరేంద్ర తెలిపారు. దోమలమందు పిచికారీను ప్రజలంతా సహకరించి, సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్ పల్లాల పద్మావతి, మలేరియా టెక్నీషియన్ పల్లాల కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మన్యం మిరియాలకు గిరాకీ



రైతుల నుంచి కొనుగోలు చేసిన మిరియాల బస్తాలు

- పెరుగుతున్న ధరలు
- తూనికల్లో మోసాలు.. రైతులకు నష్టాలు
- తరుగు పేరుతో కోత
- పట్టించుకోని అధికారులు



విక్రయానికి తీసుకొచ్చిన మిరియాలు

పెదబయలు: పెదబయలు వారపు సంత మార్కెట్‌లో గిరిజన రైతులు పండించిన మిరియా పంటకు ధర ఈ వారం బాగుంది.గత వారం కిలో మిరియాలు రూ.545 నుంచి రూ.570 వరకు ధరతో కొనుగోలు చేసిన వ్యాపారులు ఈ వారం రూ.640 నుంచి రూ.650 వరకు కొనుగోలు జరిగింది. గత వారంతో పోలిస్తే కిలోకు రూ.80 ధర పెరిగింది. దీంతో మిరియాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే తూనికల్లో మోసాలు, తరుగు పేరుతో కేజీల్లో కొతల వల్ల బస్తాకు మూడు నుంచి నాలుగు కిలోల నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. అలాగే పిప్పళ్లను రూ.310 నుంచి రూ.325, పసుపు రూ.120 నుంచి రూ.130, పిప్పళ్ల నలక రూ.85 నుంచి రూ.90 వరకు, చింతపండు రూ.40 నుంచి రూ.45 ధరతో కొనుగోలు చేశారు. ధరలు బాగున్నా తూనికల్లో మోసాల వల్ల నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి సంతల్లో మోసపూరిత తూకాలపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు

మోదమ్మ ఉత్సవాల పనులు ప్రారంభం



విద్యుత్ దీపాల ఏర్పాటు పనులకు రాటలు ప్రతిష్ఠిస్తున్న కోటిబాబునాయుడు, ఉప సర్పంచ్ రామునాయుడు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్యదైవం పాడేరు లోని మోదకొండమ్మతల్లి ఉత్సవాలకు ప్రధానమైన విద్యుత్ అలంకరణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడులు లైటింగ్ కర్రలకు పూజలు చేసి వాటిని ప్రతిష్ఠించారు. వచ్చే నెల 11, 12, 13 తేదీల్లో నిర్వహించనున్న మోదకొండమ్మతల్లి ఉత్సవాలకు ప్రతి ఏడాది విద్యుత్ లైటింగ్ ప్రధాన ఆకర్షణ. పాడేరు పట్టణంలోని మూడు రోడ్లు సుమారు 6 కిలోమీటర్ల వరకు విద్యుత్ దీపాలతో అలంకరిస్తారు. ప్రధాన జంక్షన్‌లో భారీ కటౌట్లును ఏర్పాటు చేస్తారు. విద్యుత్ అలంకరణకే సుమారు రూ.40లక్షల వరకు ఖర్చు అవుతుందని కమిటీ సభ్యులు చెబుతున్నారు. ఈ ఏడాది కూడా విద్యుత్ దీపాలంకరణకు ఉత్సవ కమిటీ అధిక ప్రాధాన్యత ఇస్తుంది. లైటింగ్ ఏర్పాట్ల పనుల ప్రారంభంలో ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కేజియారాణి, సిబ్బంది పాల్గొన్నారు.